సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



తొలి అడుగు పడింది..

పదో తరగతి పరీక్షల ప్రక్రియలో మొదటి అంకానికి అడుగు పడింది. వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ విడుదల అయింది. - 8లో▸



స్వయంవరంతో ఒక్కటాయెనె..

కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కల్యాణ మంటపంలో ఆదివారం గోమాతకు స్వయంవరం నిర్వహించి కల్యాణోత్సవం జరిపారు. - 8లో▸

డెల్టాలకు 13,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 13,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.



సేవల వందనం పర్యాటక నందనం

ఎన్నో ప్రత్యేకతలు

- పొడవు : 2.7 కిలోమీటర్లు - వెడల్పు: 1.7 మీటర్లు
- నిర్మాణం ప్రారంభం : 1897 నవంబర్ 11
- నిర్మాణ అంచనా వ్యయం : రూ.47 లక్షలు
- వంతెన ప్రారంభం : 1900 ఆగస్టు 30
- వంతెన మూసివేత : 1997
- స్తంభాలు : 56 (రాతి కట్టడాలు)
- మొట్టమొదట ప్రయాణించిన రైలు : మెయిల్
- చివరిసారి ప్రయాణించిన రైలు : కోరమాండల్ ఎక్స్‌ప్రెస్

- హేవలాక్.. గోదావరి ఐకానిక్..
- చారిత్రక వంతెన
- శతాబ్ద కాలం పాటు సేవలు
- పర్యాటకంగా అభివృద్ధికి ప్రయత్నాలు
- సాకారం కావాలని ప్రజల ఎదురుచూపులు

సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం: అమ్మమ్మగారింటికనో.. చుట్టాలింటికనో గోదావరి అవతల ఉన్న ఏ విజయవాడకో.. మెద్రాసుకో (ఇప్పుడంటే చెన్నై కానీ.. అప్పట్లో అలానే కాస్త స్టైలుగా అనేవారు ఎందుకో! కాకపోతే కొందరు మద్రాసు, మదరాసు అనేవారు) చిన్నప్పుడు వెళ్లిన వాళ్లందరికీ రాజమండ్రి పాత రైలు బ్రిడ్జిపై ప్రయాణం ఎప్పటికీ చెదరని ఓ మధుర జ్ఞాపకమే. పగటి పూట అయితే చాలా మంది కాకినాడ - మెద్రాసు సర్కార్ ఎక్స్‌ప్రెస్ లేకపోతే ప్యాసింజర్ రైలు ఎక్కేవారు. అప్పట్లో బొగ్గు ఇంజన్. కూ... అంటూ చెవులు చిల్లులు పడేలా పే....ద్ధ కూత పెట్టుకుంటూ చుక్‌చుక్‌చుక్ మంటూ వచ్చేది. రైలు నెమ్మదిగా రాజమండ్రి (కొంతమంది 'రాజమంత్రి' అనేవారు. అదేమిటో!) చేరిందంటే చాలు.. గోదావరి వచ్చేసిందని పెద్దవాళ్లు అప్రమత్తం చేసేవారు. అందరూ పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు, పది, 20 పైసలు.. కాస్త ఉన్న వాళ్లయితే పావలా నుంచి రూపాయి కాసు వరకూ చేతులతో పట్టుకుని రైలు బోగీ కిటికీలు, గేట్ల వద్దకు ఉరికేందుకు సిద్ధంగా ఉండేవారు. ఏదో యుద్ధానికి సిద్ధమైన యోధుల్లా..రైలు కూత పెట్టి నెమ్మదిగా రాజమండ్రి స్టేషన్‌ను వీడేది. ఇంజిన్.. దాని వెనుకనే ఒకదాని వెనుకన ఒక్కో బోగీ గోదావరి బ్రిడ్జి మీదుగా పరుగులు తీసేవి. ఇప్పుడంటే రోడ్ కం రైల్వే బ్రిడ్జి, ఆర్చి బ్రిడ్జి ఉన్నాయి కానీ.. అప్పట్లో రైలు గోదావరి దాటాలంటే ఒక రకం జేగురు రంగులో ఉండే రెడ్ ఆక్సైడ్ పూత పూసిన పాత బ్రిడ్జి ఒక్కటే దిక్కు... దీనికే హేవలాక్ బ్రిడ్జి అని మరో పేరు.

1897లో నిర్మాణం ఆరంభం

ఈ వంతెనను అఖండ గోదావరిపై బ్రిటిష్ వారి పాలనలో హౌరా - మద్రాసు (నేటి చెన్నై) రైలు మార్గంలో రాజమహేంద్రవరం - కొవ్వూరు పట్టణాల మధ్య 1897లో నిర్మించారు. దీనిని వంద సంవత్సరాల పాటు వినియోగంలో ఉండేలా అప్పట్లో డిజైన్ చేశారు. స్తంభాలు పూర్తి రాతి కట్టడాలు. బలమైన ఉక్కు గడ్డర్లు ఉపయోగించారు. దీని నిర్మాణానికి ఫ్రెడరిక్ థామస్ గ్రాన్‌విల్లే వాల్టన్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించారు. ఈ వంతెనకు అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ గవర్నర్ సర్ ఆర్థర్ ఎలిబ్యాంక్ హేవ్‌లాక్ పేరు పెట్టారు.

అమ్మో బ్రిడ్జి మీద ప్రయాణమే..

అప్పట్లో ఆ బ్రిడ్జిపై ప్రయాణం అంటే చాలామందికి హడల్.. గుండెలు గుబగుబలాడిపోయేవి. ఓపక్క లక్‌లక్.. లక్‌లక్ అంటూ రైలు చక్రాల సౌండ్.. అది ఇనుప బ్రిడ్జి కావడంతో వాటి అదురు నుంచి వచ్చే రీసౌండ్.. చిన్న పిల్లలైతే భయంతో బిర్రబిగుసుకుపోయేవాళ్లు. మరోపక్క కిందన అఖండ గోదావరి. ఎటు చూసినా కనుచూపు మేరంతా అగాధంలాంటి జలరాశే. అసలే ఆ బ్రిడ్జికి అటూ ఇటూ ఏమీ ఉండేవి కావు. ఒక వేళ ఈ రైలు ఆ బ్రిడ్జి మీంచి కింద పడిపోతే.. అనే ఆలోచన వస్తేనే పై ప్రాణాలు పైనే పోయినట్టుండేది. (ఒకవేళ బ్రిడ్జికి అటూ ఇటూ గోడలుంటే మాత్రం వేగంగా వెళ్తున్న రైలు పడితే ఆపుతాయా? అదో వెర్రి ఆలోచన.) ఈలోగా గోదావరిలో డబ్బులేసేవాళ్లు.. పూలు, పండ్లు విసిరేవారు.. చల్లగా చూడాలమ్మా అంటూ తల్లి గోదారికి దణ్ణాలు పెట్టేవాళ్లు. ఈ ప్రాంత ప్రజలతోనే కాదు.. ఉత్తరాంధ్ర ప్రజలతో కూడా అనుబంధం పెనవేసుకున్న ఈ హేవలాక్ వంతెనకు చాలానే చరిత్ర ఉంది.

ప్రగతికి ప్రణాళిక



ఈ పురాతన వంతెనకు సంబంధించి ఫిట్‌నెస్ వివరాల కోసం రైల్వే శాఖను అడిగాం. అవి వస్తే మా కార్యాచరణ రూపుదిద్దుకుంటుంది. నదిపై ఈ వంతెనను ఆహ్లాదకరంగా మలచాలని యోచిస్తున్నాం. పర్యాటక శాఖ ఎండీ కన్నబాబుతో ఇప్పటికే సంప్రదింపులు జరిపాం. అందమైన షాపింగ్ కాంప్లెక్స్‌లు..వాకర్స్ కోసం పాత్‌వే నిర్మించాలనే ప్రణాళిక ఉంది. దేశంలో ఎక్కడాలేని విధంగా నదిపై అనుభూతి మిగిల్చేలా హేవలాక్ వంతెన మార్గాన్ని వినియోగించుకోవాలనేది నా ఉద్దేశం. దీని అభివృద్ధిపై ఓ ప్రైవేట్ సంస్థతో కూడా చర్చిస్తున్నాం.

– మార్గాని భరత్, ఎంపీ రాజమహేంద్రవరం

అంతకు ముందు కేవలం పడవలే..

హేవలాక్ బ్రిడ్జి నిర్మించక ముందు గోదావరి నదిని దాటడానికి ఇక్కడి ప్రజలు పడవలే వినియోగించేవారు. ఆ రోజుల్లో గోదావరి వరద ఉధృతంగా ఉంటే ఒక్కోసారి పడవలు తలకిందులై ప్రాణనష్టం కూడా జరిగేది. అటువంటి దుస్థితికి ఈ వంతెన చెక్ చెప్పింది. ప్రజలు సురక్షితంగా గోదావరి దాటడానికి ఒక రవాణా సాధనం లభించింది. అప్పట్లో బ్రిడ్జిపై ఎలాంటి ఆధారం లేకుండా రైలు వెళ్తొంటే అందులోని ప్రయాణికులు చాలా భయపడేవారు. అదే సమయంలో థ్రిల్‌గా కూడా ఫీలయ్యేవారు.

పర్యాటక ఆకర్షణగా మార్చేందుకు ప్రణాళిక

రైళ్ల రాకపోకలను 1997లో నిలిపివేసిన పదేళ్ల తరువాత ఈ వంతెనను పర్యాటకంగా, రాజమహేంద్రవరం - కొవ్వూరు మధ్య పాదచారుల మార్గంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రభుత్వం భావించింది. ఇందుకు అనుగుణంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 2008లో ఈ వంతెన సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టేందుకు తీర్మానం చేసింది. దీనిపై రైల్వే మంత్రిత్వ శాఖ స్పందించలేదు. నాటి ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ ఈ ప్రాజెక్ట్‌ను ఆమోదించాల్సిందిగా రైల్వే శాఖకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. హేవలాక్ బ్రిడ్జిని తొలగించి, దానిలోని ఉక్కును తీసుకువెళ్లాలని రైల్వే శాఖ చేసిన యత్నాలను స్థానికులు తిప్పి కొట్టారు. ఈ ఐకానిక్ వంతెనను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. బ్రిడ్జిపై రోడ్డు వేస్తే చిరు వ్యాపారులకు, రైతులకు ఉపయోగపడుతుందని, వాకింగ్ ట్రాక్‌గా కూడా పనిస్తుందని చెప్పారు. చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేస్తే పర్యాటకంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 2017లో రైల్వే శాఖకు కొంత మొత్తం చెల్లించి, సొంతం చేసుకుంది. దీనిని వారసత్వ సంపదగా అభివృద్ధి చేస్తామని చెప్పింది. అడుగులు ముందుకు పడలేదు. ప్రస్తుత రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ కల సాకారమయ్యే రోజు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

హేవలాక్ అభివృద్ధికి కృషి



అద్భుతమైన కట్టడం హేవలాక్ వంతెన. దీని అభివృద్ధికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కృషి చేయనుంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ, రుడా సంయుక్త ఆధ్వర్యంలో రూ.4.70 కోట్లతో ఇప్పటికే ఆధునిక విద్యుత్ దీపాల వ్యవస్థ ఏర్పాటు చేశాం, ఈ నిధుల్లో రుడా రూ.2 కోట్లు సమకూర్చింది. హేవలాక్ అభివృద్ధికి మరో రూ.65 లక్షలు విడుదల చేశాం.


– బి. బాలస్వామి, రుడా వైస్ చైర్మన్ , రాజమహేంద్రవరం

నదిపై అందాల మెరుపులు



వంతెనను సుందరంగా, ఆకర్షణీయంగా రూపుదిద్దుకునేలా చేస్తాం. ఇప్పటికే రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆర్నమెంటల్ లైటింగ్ ఏర్పాటు చేశాం. రాత్రి వేళ గోదావరి నదిపై ఈ విద్యుత్ కాంతులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ విషయంలో మాతో రుడా కూడా చేతులు కలిపి సహకరిస్తోంది., మరో రూ. 50 లక్షలతో లైటింగ్ కంట్రోల్ రూమ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు పర్యాటక శాఖ మరో రూ.1.5 కోట్లతో ఆధునీకరణ పనులు చేపడుతుంది.

– దినేష్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్, రాజమహేంద్రవరం



న్యూస్‌రీల్

రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్

రాజమహేంద్రవరం సిటీ: విజయనగరం జిల్లా సమీపంలో జరిగిన రైలు ప్రమాదంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం జరిగిన ఈ ప్రమాద ఘటనతో రాజమహేంద్రవరం రావాల్సిన పలురైళ్లు రాక ఆలస్యమైంది. విజయవాడ డివిజనల్ రైల్వే అధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో రైల్వే అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం 0883- 2420251, తుని 08854 252172, సామర్లకోట 0884 2327010లో నంబర్లతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఇది 24 గంటలూ పనిచేస్తుందని స్టేషన్ సుంకర చంద్రమౌళి తెలిపారు.

జాబ్ మేళా రేపు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నాక్ ప్రాంగణంలో మంగళవారం 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. పీజీ, డిగ్రీ, ఫార్మసీ, ఇంటర్, ఐటీఐ, పదవ తరగతి పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వివరాలకు 91339 12947, 96760 52454 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు యథావిధిగా స్పందన

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా జిల్లా స్థాయి స్పందన నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్, మున్సిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నారన్నారు.

నేడు వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. చిక్కాల-1 (చాగల్లు), కడియం-4 (కడియం), బుచ్చింపేట (కోరుకొండ), కవులూరు (నల్లజర్ల), పిడింగొయ్యి-3 (రాజమహేంద్రవరం రూరల్), భూపాలపట్నం-2 (రాజానగరం), వంగలపూడి(సీతానగరం), తాళ్లపూడి-1 (తాళ్లపూడి), మోర్త (ఉండ్రాజవరం), రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ నగర్, ఆనంద్ నగర్, ఆవ వాంబే కాలనీ, మెరక వీధి, సారంగధరమెట్ట యూపీహెచ్‌సీల్లో శిబిరాలు జరుగుతాయన్నారు.

సామర్థ్య సర్వేకు సిద్ధం

- నవంబర్ 3న ఎస్ఈఏఎస్-2023 సర్వే
- జిల్లాలో 926 పాఠశాలల ఎంపిక
- పరీక్షకు హాజరుకానున్న 25,482 మంది విద్యార్థులు
- సన్నద్ధమైన జిల్లా విద్యాశాఖ

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. దేశవ్యాప్తంగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే-2023 నవంబర్ 3వ తేదీన నిర్వహించనుంది. ఇందుకు తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 926 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 3,6,9 తరగతుల్లోని 25,482 మంది విద్యార్థులు సర్వేలో భాగస్వాములు కానున్నారు. వివిధ అంశాల్లో నిర్వహించే పరీక్ష ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 3,435మంది విద్యార్థులు తెలుగు, 22,047 మంది ఆంగ్లం మాధ్యమంలో పరీక్ష రాయనున్నారు. రానున్న రోజుల్లో మరింత పటిష్టంగా విద్యాప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వే దోహదపడనుంది. దీంతో విద్యాశాఖ అధికారులు ఎస్ఈఏఎస్‌ను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.

పరీక్ష నిర్వహణ ఇలా...

గతంలో మాదిరిగా ఈవీఎస్, సైన్సు, సోషల్ సబ్జెక్టులలో ప్రశ్నలు ఈ దఫా ఉండవు. కేవలం ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, తరగతి స్థాయిలో గణితం, లాంగ్వేజ్‌లలో మాత్రమే ఈ సర్వే కొనసాగుతుంది. 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాల పరీక్షా సమయం ఉంటుంది. లాంగ్వేజ్ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 , గణితం 10, సాధారణ లాంగ్వేజ్‌లో 10 ప్రశ్నలు ఉంటాయి. 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాల పరీక్షా సమయం ఉంటుంది. ఎఫ్ఎల్ఎన్ లాంగ్వేజ్ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10, గణితం 15, లాంగ్వేజ్ 15ప్రశ్నలు వస్తాయి. 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల సమయం ఉంటుంది. ఎఫ్ఎల్ఎన్ లాంగ్వేజ్ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10, గణితం 20, లాంగ్వేజ్ 20 ప్రశ్నలు ఉంటాయి.



బొమ్మూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇన్విజిలేటర్లకు శిక్షణ (ఫైల్)

ఇన్విజిలేటర్లు 1,020 మందికి శిక్షణ పూర్తి

ఎంపిక చేసిన పాఠశాలల్లో పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు 1,020 మంది ఇన్విజిలేటర్లను విద్యాశాఖ నియమించింది. ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తే అభ్యసనా సామర్థ్యాలు సజావుగా వెలుగుచూసే అవకాశం ఉండదని భావించి ఇన్విజిలేటర్లుగా డైట్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగిస్తున్నారు. వీరికి ఇప్పటికే దశలవారీగా శిక్షణ కూడా పూర్తిచేశారు. భవిష్యత్తులో మెరుగైన విద్యాప్రణాళికలు, పాఠ్యాంశాల్లో మార్పులకు సామర్థ్య సర్వే గీటురాయి కానుంది.

ఏర్పాట్లు పూర్తి



స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2023 నవంబరు 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. పరీక్ష నిర్వహణపై ఇన్విజిలేటర్లు, ఎంఈవోలకు ప్రత్యేక సూచనలు అందించాం. అందరినీ సమన్వయం చేస్తున్నాం. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పక్కాగా లెక్కించేందుకు, భవిష్యత్తులో పాఠ్యాంశాల్లో చేయాల్సిన మార్పులపై స్పష్టత ఏర్పడుతుంది. విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం కావాలి.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పుగోదావరి

పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తతో ఉండాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. స్థానిక జాంపేటలోనున్న పోలీస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఎస్పీ హాజరయ్యారు. ఏసీవై రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఎక్స్‌పర్ట్ హాస్పిటల్, అగర్వాల్ హాస్పిటల్, మాగ్నా హాస్పిటల్, సాయిరాం హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణులు ఈ శిబిరంలో పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసే పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే విధులు సమర్థంగా నిర్వహించగలరన్నారు.

రూ.10 వేలు అందజేత

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 2008లో బలిమెల ఘటనలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బంది రవికుమార్, వెంకట్రావుల కుటుంబ సభ్యులకు రూ.10 వేల చొప్పున చెక్కులను ఎస్పీ అందజేశారు. పోలీసు ఉద్యోగంలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల ఫంక్షన్లకు పోలీస్ కన్వెన్షన్ హాల్ ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఏఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న ఎస్పీ జగదీష్

క్లుప్తంగా

అండర్-17 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక


తూర్పుగోదావరి అండర్-17 బాలికల క్రికెట్ జట్టు సభ్యులు

అమలాపురం రూరల్: అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్-17 బాలికల క్రికెట్ జట్టు ఎంపికలు ఆదివారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ క్రికెట్ సెలక్షన్‌లో భాగంగా ఈ ఎంపికలకు పలు పాఠశాలల చెందిన క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం.రమేష్ తెలిపారు. ఈ జట్టు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ తోట రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వలసపాకల జంక్షన్‌లో వ్యాన్ ఢీకొట్టడంతో మృతిచెందిన దుర్గ

కాకినాడ రూరల్: వలసపాకల చేపల మార్కెట్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణయ్యపేట కాపుల రామాలయం వీధికి చెందిన యువకుడు పొన్నగంటి దుర్గ (32) మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కోరమాండల్ కర్మాగారం వద్ద క్యాంటిన్‌లో వంట మనిషిగా పనిచేసే దుర్గ ఉదయమే విధుల నిమిత్తం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. వలసపాకల చేపల మార్కెట్ వద్దకు వచ్చేసరికి ఐస్‌తో రవాణా చేసే వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గ తల పైనుంచి వ్యాన్ వెనుక చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి బావ సుబ్బారావు ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గ్రహణం సందర్భంగా జపాలు చేస్తున్న పురోహితులు

గ్రహణం పట్టు నుంచి విడుపు వరకూ..

రాజమహేంద్రవరం: చంద్రగ్రహణం శనివారం అర్ధరాత్రి 1.04 గంటల నుంచి 2.24 గంటల వరకూ పాక్షికంగా కనిపించింది. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గ్రహణ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. ఈ సందర్భంగా పలువురు అక్కడ పట్టు, విడుపు స్నానాలు, గ్రహణ కాలంలో జపాలు చేశారు.


రాత్రి 1.30 గంటల సమయంలో..


రాత్రి 2.25 గంటలకు..


గ్రహణ స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తొలి అడుగు పడింది..

- 'పది' పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 10లోగా ఫైన్ లేకుండా చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ పరీక్షల విభాగం
- ఉమ్మడి జిల్లాలో 70 వేల మంది విద్యార్థులు

రాయవరం: పదో తరగతి పరీక్షల ప్రక్రియలో మొదటి అంకానికి అడుగు పడింది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎస్ఎస్‌సీ పరీక్షలకు శనివారం నుంచి పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబరు 10వ తేదీలోగా అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న రెగ్యులర్/ఫెయిల్ అయిన అభ్యర్థులు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది. వరుసగా నాల్గో ఏడాది కూడా పరీక్ష ఫీజుల్లో ఎలాంటి పెంపుదల చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు ఆర్‌సీ నంబర్ జీఈ-ఎగ్జామ్‌ఓఎస్ఎస్‌సీ/డీడీ-2/2023-డీజీఈ ప్రకారం పరీక్ష ఫీజు ఎలా చెల్లించాలి? ఏ తేదీలోగా చెల్లించాలనే తదితర వివరాలతో 'సాక్షి' కథనం.

అపరాధ రుసుం లేకుండా..

వచ్చే నెల 10వ తేదీలోగా పదో తరగతి పరీక్ష ఫీజు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు. ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు నవంబర్ 10వ తేదీలోగా నామినల్ రోల్స్ పూర్తిచేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లోని లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాలి. సీఎఫ్ఎంఎస్ ద్వారా కాని, చలానా ద్వారా కాని పరీక్ష ఫీజు చెల్లిస్తే నిరుపయోగమవుతుంది. రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 11వ తేదీ నుంచి 16వ తేదీలోగా చెల్లించవచ్చు. నవంబర్ 17 నుంచి 22వ తేదీలోగా రూ.200 అపరాధ రుసుంతో విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించే అవకాశం ఉంది. నవంబర్ 23 నుంచి 30వ తేదీ వరకూ రూ.500 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజును చెల్లించే వీలుంది. పైన పేర్కొన్న తేదీల్లో ఏవైనా సాధారణ సెలవు దినాలుంటే తర్వాత పనిదినం రోజున కూడా ఫీజు చెల్లించడానికి అనుమతిస్తున్నారు.

పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో 203, ప్రభుత్వ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ కింద 10 చొప్పున, ఎయిడెడ్‌లో మూడు, సాంఘిక సంక్షేమంలో ఆరు, బీసీ వెల్ఫేర్ యాజమాన్యంలో రెండు, ప్రైవేట్ యాజమాన్యంలో 160 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 19,745 మంది, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 5,105 మంది విద్యార్థులు పదో తరగతి విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా పరీక్ష ఫీజులు చెల్లించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 70 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

పరీక్ష ఫీజు ఇలా..

రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలి. ఫెయిలైన అభ్యర్థులు మూడు కన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు, ఎస్ఎస్‌సీ పరీక్ష ఫీజు రూ.125కు అదనంగా మరో రూ.60లు చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ వయసున్న విద్యార్థులు (అండర్ ఏజ్ స్టూడెంట్స్) ఫీజుగా రూ.300 కట్టాలి. చైల్డ్ విత్ స్పెషల్ నీడ్ (సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సదరం సర్టిఫికెట్ లేనివారు సంబంధిత పాఠశాల హెచ్ఎం ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం పంపించిన ఫార్మాట్‌లో సివిల్ సర్జన్ ధ్రువీకరించి సబ్మిట్ చేసే వీలును ప్రభుత్వం కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి. పూర్తిచేసిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లోనే సబ్మిట్ చేయాలి.



పొరపాట్లకు తావివ్వొద్దు



ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేని విధంగా నామినల్ రోల్స్‌ను ఒకటికి రెండు సార్లు సరిచూసుకుని మాత్రమే సబ్మిట్ చేయాలి. చిన్న తప్పుదొర్లినా సంబంధిత పాఠశాలల హెచ్ఎంలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– ఎస్.సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

జాగ్రత్తలు తీసుకోవాలి



ఆన్‌లైన్‌లోనే నామినల్ రోల్స్ సబ్మిట్ చేయాలి. సమయం తక్కువగా ఉన్నందున పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరీక్ష ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ తయారీకి సన్నద్ధం కావాలి. హెచ్ఎంలు మాన్యువల్ నామినల్ రోల్స్ తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.

– జి.నాగమణి, ఆర్జేడీ, కాకినాడ

ఉప్పాడలో అగ్ని ప్రమాదం

ఆహుతైన వలలు, మోటారు సైకిళ్లు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు నాయకర్ కాలనీ-1లో మైలపల్లి అప్పారావుకు చెందిన షెడ్డు ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదానికి గురైంది. ఆ షెడ్డులో ఉంచిన 3 మోటారు సైకిళ్లు, ఆరు వలలు కాలిపోయాయి. బాధితులు, అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం.. అప్పారావుకు చెందిన షెడ్డులో స్థానికంగా ఉన్న రామిశెట్టి జగన్నాథం, చొల్లంగి ప్రసాద్, చొల్లంగి దుర్గారావులకు చెందిన మోటారు సైకిళ్లు, మైలపల్లి అప్పారావు, గంటా పోలరాజు, రామిశెట్టి జగన్నాథం, చొల్లంగి నాగేశ్వరరావులకు సంబంధించిన వేటకు ఉపయోగించే వలలు ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో విద్యుదాఘాతానికి మంటలు వ్యాపించి అవి కాలిపోయాయి. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిలినట్లు అంచనా వేశారు. బాధితులను ఆదివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించి వలలు కాలిపోయిన మత్స్యకారులకు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎంపీటీసీ యల్లాజీ, మత్స్యకార నాయకులు గోగు బుజ్జీ తదితరులు ఉన్నారు.


కాలిపోయిన షెడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

మహిళ దుర్మరణం

దేవరపల్లి: జాతీయ రహదారి (516డి)పై దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని దివ్యాంగుల ఆశ్రమం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన నాగవేణి (45) మృతి చెందింది. ఆమె భర్త ఏసయ్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కన్నాపురానికి చెందిన దిరిసాము ఏసయ్య, అతని భార్య నాగవేణి బైక్‌పై దేవరపల్లి నుంచి గోపాలపురం వైపు వెళుతుండగా, వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగవేణి అక్కడికక్కడే మృతి చెందగా, ఏసయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం


నారీ శక్తి సమ్మేళనంలో మాట్లాడుతున్న అన్నదానం సీతాగాయత్రి

రాజానగరం: భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తరుణీమణులపైనే ఉందని పలువురు మహిళా ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అఖిల భారత మహిళా సమన్వయ వేదిక యోజన ఆశయాల్లో భాగంగా స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఆదివారం 'నారీ శక్తి సమ్మేళనం' నిర్వహించారు. దీనికి రాష్ట్ర సేవికా సమితి, అఖిల భారతీయ ప్రముఖ్ కార్యవాహిక అన్నదానం సీతాగాయత్రి, ఆధ్యాత్మికవేత్త సి.అనంతలక్ష్మి, జీఎస్ఎల్ చైర్‌పర్సన్ డాక్టర్ గన్ని కాశింబీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకూ దేశ సర్వతోముఖాభివృద్ధిలో కీలకపాత్ర వహించిన భారత నారీ ప్రపంచంలో ఇతర దేశాల స్త్రీలకు దిక్సూచిగా నిలిచిందన్నారు. నేడు ఆ వాతావరణం దూరమైపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు గల కారణాలను అన్వేషించడం, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని జాగృతం చేయడం కోసమే 'నారీ శక్తి సమ్మేళనం' నిర్వహించామన్నారు. అనంతరం బృందాల వారీగా చర్చలు జరిపారు. మహిళలకు సంబంధించిన వివిధ అంశాలపై పోస్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భారత దేశ కీర్తి ప్రతిష్టలను, సంస్కృతీ సంప్రదాయాలను మరింతగా ఇనుమడింపజేయడంలో ప్రతి మహిళ భాగస్వామి కావాలని వక్తలు తమ ప్రసంగాల్లో అభిప్రాయం వ్యక్తపరిచారు.

స్వయంవరంతో ఒక్కటాయెనె..

- వైభవంగా గోమాత 'సారణ' కల్యాణోత్సవం
- స్వయంవరంలో పాల్గొన్న 10 నందీశ్వరులు
- కనులారా తిలకించి తరించిన భక్తులు

కాకినాడ రూరల్: కల్యాణం... కమనీయమంటారు పెద్దలు. పచ్చని పందిళ్లు.. ముత్యాల తలంబ్రాలు, వేద మంత్రాలు, భాజా భజంత్రీలు, కన్యాదానం, మాంగళ్యధారణ ఇలా... వివాహం ప్రతిఒక్కరి జీవితంలో కలకాలం గుర్తుండిపోతుంది. అయితే అన్నింటి కంటే భిన్నంగా సనాతన ధర్మం ప్రకారం లక్ష్మీదేవి స్వరూపం గోమాత కల్యాణం జరిగితే అది మధురానుభూతే. గోమాత సారణ కల్యాణోత్సవం ఆదివారం ఉదయం కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్ కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. తిరుమల ఆసుపత్రి వైద్యుడు గౌరీశేఖర్, రమాదేవి దంపతులు తమ పెంపుడు గోవు సారణకు స్వయంవరం ప్రకటించారు. దీంతో ఏలేశ్వరం మండలం లింగంపర్తి వద్ద కొండ తిమ్మాపురంలోని నాడీపతి గోశాల ఆవరణలోని 89 నందీశ్వరులు (గిత్తలు)ను తొలుత ఎంపిక చేశారు. వాటి నుంచి 24కు కుదించారు. మళ్లీ ఇందులో 16ను ఎంపిక చేయగా స్వయంవరంలో 10 గిత్తలు పాల్గొన్నాయి. ఇందులో ప్రపంచంలోనే అత్యంత పొట్టివైన పుంగనూరు గిత్తలు ఉండడం విశేషం. తిరుపతి, కంచి, తిరువణ్ణామలై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు తొలుత డాక్టర్ గౌరీశేఖర్, రమాదేవి దంపతులతో విఘ్నేశ్వర, గౌరీ పూజలు జరిపించారు. అనంతరం స్వయంవరం ప్రకటించగా భైరవ, కృష్ణుడు, రాముడు, లక్ష్మణుడు, యువరాజు నిద్రవర్మ, యువరాజు మహేంద్ర కన్నయ్య, బుద్ధుడు, మంగరాజు, ధర్మరాజు, షణ్ముఖ కన్నయ్య తదితర పేర్లతో పిలిచే నందీశ్వరులను ప్రవేశపెట్టారు. డాక్టర్ గౌరీశేఖర్ వధువు సారణను తీసుకువచ్చి స్వయంవరంలో నందులు వద్ద ఉంచగా వాటిని పరీక్షించి మధ్యలో ఉన్న షణ్ముఖ కన్నయ్యను ఎంపిక చేసుకుంది. షణ్ముఖ కన్నయ్య తరఫున తల్లిదండ్రులుగా పాకలపాటి నారాయణరాజు, సీతాదేవి వివాహ వేడుకను జరిపించారు. వరుడు కాళ్లను డాక్టరు గౌరీశేఖర్ దంపతులు కడిగి వివాహం జరిపించారు. అత్యంత రమణీయంగా జరిగిన వేడుకను భారీగా తరలివచ్చిన ప్రజలు తిలకించారు.


స్వయంవరంలో వరుడి ఎంపికలో సారణ


సారణ, షణ్ముఖ కన్నయ్య కల్యాణోత్సవంలో డాక్టర్ గౌరీశేఖర్, రమాదేవి


కల్యాణ మండపం వద్ద చిట్టి పుంగనూరు గిత్తతో ఉమర్‌ఆలీషా

గోమాత లక్ష్మీ స్వరూపం

గోమాత లక్ష్మీ స్వరూపమని, ఎక్కడ గోపూజలు జరుగుతాయో అక్కడ సుభిక్షంగా ఉంటుందని పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువు అన్నారు. ఈ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గోమాత కల్యాణోత్సవం తలపెట్టిన డాక్టర్ గౌరీశేఖర్ దంపతులు అభినందనీయులన్నారు. నాడీపతి వైద్యుడు కృష్ణంరాజు మాట్లాడుతూ స్వయంవరం ద్వారా గోమాత కల్యాణోత్సవం అరుదు అన్నారు. డాక్టర్ గౌరీశేఖర్ మాట్లాడుతూ తాను సారణను దత్తత తీసుకుని కూతురుగా భావించి ఇప్పుడు కల్యాణోత్సవం జరిపించామన్నారు. ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు వాయిదా

- 31న దేవదాయ మంత్రి పర్యటన రద్దు
- తిరిగి నవంబర్ 8న జరిగే అవకాశం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం జరగాల్సిన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు వాయిదా పడ్డాయి. సత్యగిరిపై రూ.20 కోట్లతో నిర్మించిన శివసదన్ సత్రం, రూ.రెండు కోట్లతో దాత పెన్నాడ రాజామణి నిర్మించిన డార్మెట్రీ, రూ.1.20 కోట్లతో నిర్మిస్తున్న ఆదిశంకరమార్గ్ రోడ్డుకు సోమవారం ఉదయం మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉంది. ఈ నెల 31న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఉండటంతో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరు కాలేకపోతున్నారు. దీనివల్ల ప్రారంభోత్సవాలు వాయిదా వేశామని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదివారం ప్రకటించారు. నవంబర్ 8న ప్రారంభోత్సవాలు జరిగే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

త్వరితగతిన పూర్తి చేయండి

సత్యగిరిపై రూ.20 కోట్లతో నిర్మించిన 138 గదుల శివసదన్ సత్రం వెనుక ఫ్లోరింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదివారం పరిశీలించి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా దాత పెన్నాడ రాజామణి రూ.రెండు కోట్లతో నిర్మించిన డార్మెట్రీ ముందు భాగంలో ఫ్లోరింగ్ టైల్స్ అతికిస్తున్నారు. ఈ పనులు రెండ్రోజుల్లో పూర్తి కానున్నాయి. ఇదిలా ఉంటే 30 వీఐపీ సత్రం కూల్చి వేసినందున అక్కడ ఖాళీ ప్రదేశాన్ని చదును చేస్తున్నారు. పశ్చిమ రాజగోపురంపై మెట్లుకు సమానంగా ఈ స్థలాన్ని చదును చేయించి అక్కడ 130 వెడల్పు, 180 అడుగుల పొడవు షెడ్డు నిర్మించనున్నట్టు చైర్మన్, ఈఓ తెలిపారు. పురుషులు, స్త్రీలకు విడివిడిగా నిర్మిస్తున్న టాయిలెట్స్ పనులు కూడా కార్తికమాసం నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానాలయంలోకి రూ.300 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనం కోసం ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఉండే ప్రదేశంలో కొత్తగా ద్వారం ఏర్పాటు చేసి అక్కడ ప్రత్యేకంగా క్యూ ఏర్పాటు చేస్తున్నారు. స్వామి, అమ్మవారి ఆభరణాలు భద్రపరిచేందుకు కూడా ఆలయం సమీపంలోనే ప్రత్యేకంగా గది నిర్మించారు. ఆ పనులను కూడా ఈఓ అజాద్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.


డార్మెట్రీ ముందు ఫ్లోరింగ్ టైల్స్ పనులు


దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న షెడ్డు

నేడు బ్రహ్మశ్రీ చాగంటి ప్రవచనం

అన్నవరం జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం 'దేవాలయ ఉద్యోగులు, విద్యార్థులకు మార్గదర్శనం' అనే అంశంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం చేయనున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకూ ఈ ప్రవచనం ఉంటుందని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్, వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. దీనికోసం కళాశాల మైదానంలో స్టేజీ ఎదురుగా రెండు వేల మంది కూర్చునేందుకు వీలుగా షెడ్డు నిర్మిస్తున్నారు. అన్నవరం దేవస్థానం ఉద్యోగులు, పురోహితులు, దేవస్థానం విద్యాసంస్థల, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు హాజరు కావాలని ఈఓ కోరారు.

ముగిసిన రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం: మండలంలోని సంపత్‌నగరం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన 67వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. క్రీడాకారులు పోటీ పడుతూ చూపరులకు ఉత్కంఠకు గురిచేశారు. వివిధ జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు, పీఈటీలు హాజరయ్యారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిలో కడప, కర్నూలు, తూర్పుగోదావరి జిల్లాల వారే అధికంగా ఉండటం విశేషం. మూడు విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కేవీ స్వామి తెలిపారు. 14 ఏళ్ల ఓపెన్ సైట్ బాలుర విభాగంలో ఎం.హర్షఅభిషేక్ (తూర్పుగోదావరి) ప్రథమ స్థానంలో నిలువగా ఎల్.రామజీఘ్నేష్ (కర్నూలు) ద్వితీయ, ఏపీఎస్ ఆర్ఎస్ రెడ్డి (కడప) తృతీయ స్థానం సాధించారు. బాలికల విభాగంలో బి.నక్షత్ర (కర్నూలు), వి.జారా (కడప), సీజీ ప్రవల్లిక (అనంతపురం) మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. 17 ఏళ్ల ఓపెన్ సైట్ బాలుర విభాగంలో మొదటి మూడు స్థానాల్లో బి.రాకేష్‌రెడ్డి (కర్నూలు), వై.అభినయ్ (కడప), కేడీ నాగసాయి (తూర్పుగోదావరి) నిలిచారు. బాలికల విభాగంలో వి.మన్విత (కడప), ఎస్‌కే జహార్‌తాజ్ (కడప), ఎం.సాయిఐశ్వర్య (కర్నూల్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. 19 ఏళ్ల ఓపెన్ సైట్ బాలుర విభాగంలో కడపకు చెందిన ఎస్.మహ్మద్ యుబాయిద్, జి.వెంకట శశాంక్‌రెడ్డి, ఇ.సుమంత్‌లు వేరొక జిల్లా వారికి అవకాశం ఇవ్వకుండా మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో వి.ఫిజాసుల్తానా (కడప) ప్రథమ, ఎస్‌కే అహ్మద్‌జుహీదా (తూర్పుగోదావరి) ద్వితీయ, బి.వెంకటసుబ్బలక్ష్మి (కడప) తృతీయ స్థానాలను దక్కించుకున్నారు.


రైఫిల్ షూటింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు